# చావుకూడు

"ఇంత పెద్ద పట్నంలో పది రోజుల్నుంచీ వాగ నాకొడుకూ సావలేదే! యట్లబ్బా జీవనం గడిసేదీ!! సాలీ సాలని బతుకు లాయ! ఇంట్లో బాశాలికుండే వాగ సీరా సినిగిపోయుండాది. రయికా అసలే నేదు. తెత్తా మంటేనా సేతిలో కాసు లేకపాయ బిడ్లని సూస్తే పదిమంది ఆరు మంది ఆడముండలు, నలుగురు మొగ పిలకాయలు గంపెడు సంసారఁవు అద్దాలక ఆ బాశాలి మళ్లా నీళ్లు బోసుకునింది మూడో నెల. అప్రేసును జేసుకుందామంటే యినదు. ఆ పత్తేలు మన ముండలేము. కనీసం ఆర్నెల్లయినా పనీ పాటా సేయకూడదంట. ఏఁవైనా జరిగితే ఈ గంపడు సంసారఁవూ ఎవురు సూత్తారయ్యా' అంటుంది. అది సెప్పేది గూడా నిజఁ వే. బుద్దీ గ్యానమూ వుండే వోడెవుడూ గాదనడు పెద్దబిడ్డెలిద్దురూ అబ్బుడే ఎదిగి ఎదమింద కూసున్నారు. వోళ్లకు పెండ్లిండ్లు జేయాల లేకంటే ఎబ్బుడో వాగబ్బుడు ఎవర్నో వాగర్ని ఎత్తకపూడస్తారు. ఆనేక బరముండదు. సంక బిడ్డెకు జొరం దానికంటే, పెద్దదానికి వాగిటే దగ్గు కరక్కాయ దగ్గు మూడోదానికి పోలీయాది. వోళ్ళ మానానికి గుడ్డ పీలికే నేదు. ఇంకేడ సూపెట్టేది? అది సాలక రేపో, మాపో అన్నట్టు వాగిటే దగ్గుతో, ఆర్నెల్ల పడవతో మంచమ్మీద బడుండే నాయన. యట్లబ్బా ఈ సంసారఁ వేగేదీ?"

ఉదయాన తన గుడిసెముందర కూర్చుని ఆలోచిస్తున్నాడు మునిదాసప్ప. అదే సమయంలో అతని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ఇంట్లో పెద్ద గందరగోళం జరిగింది. అటువైపు చూశాడతను. ఇంచుమించుగా ఒకే పొడవున్న ముగ్గురు మగపిల్లలు ఒకే చొక్కా కోసం పోట్లాడుకుంటున్నారు. వెళ్లి విడిపించాడు. ఇంతలో చేతిలో ఏదో ఎత్తుకుని పరుగెత్తుకుంటూ వచ్చాడు అతని కొడుకుల్లో ఒకడైన శివదాసప్ప. తండ్రిని చూసి అక్కడే ఆగిపోయాడు.

"ఏందిరా, శివదాసా, అది?" అడిగాడు అనుమానంగా మునిదాసప్ప.

"ఏమీ లేదు, ఏమీ లేదు."

భయం భయంగా తన రెండు చేతులూ వెనక్కి దాచుకున్నాడు. కనుక్కుంటే ఎక్కడ కొడతాడో నన్న భయం అతని ముఖంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"సెప్పరా లేకుంటే శరమ్ము దీసేత్తా!" కోపంతో ఊగిపోయాడు.

"అదీ ... అదీ ... " అంటూ రెండడుగులు వెనక్కి వేశాడు శివదాసప్ప.

"వొరే, నా కొడకా! సెప్తా వుంటే నీక్కాదంట్రా! ఇట్టియ్యి." అతని చేతుల్లోంచి లాక్కున్నాడు. దాన్ని చూసిన అతని కళ్ళు క్షణం సేపు చెమర్చాయి

"ఏందిరా, ఇది?" అదేమిటో తెలుసున్నా అప్రయత్నంగానే అనేశాడు.

"ఎవరో సచ్చిపోయుంటే ఈ దినం పిండం బెట్నారు. నిన్నట్నుంచీ సెల్లి బువ్వే దిన్లా. ఆ యమ్మి కిద్దా మని దెచ్చినా" వణికిపోతూ చెప్పాడు శివదాసప్ప.

ఆ మాట వినగానే అతని కళ్ళ వెంట రెండు కన్నీటి బొట్లు రాలాయి. తన పిల్లలకు పిడికెడు అన్నం పెట్టలేని తన పరిస్థితికి తానే జాలిపడ్డాడు. ఇంతలో అతని చేతిలోని పిండాన్నాన్ని చూసేసరికి పిల్ల లంతా కాకుల్లా ఎగబడ్డారు. దేవుడి ప్రసాదంలా దాన్నే తలా కొంచెం పంచాడు. ఆ తర్వాత మునిదాసప్ప ఆలోచిస్తూ అక్కడే కూర్చున్నాడు. సంక బిడ్డ పాల కోసం ఏడుస్తోంది.

మరో బిడ్డ నల్లగా మురికి పట్టి, సొట్టలు పడివున్న సత్తు గిన్నె తీసుకుని "అమ్మా! బువ్వే!" అంటూ శోక రాగం తీస్తోంది.

"అమ్మా! పక్కింటి సుబ్బక్క కొడుకు ఇస్కూలుకు బోతావుండాడే. నానూ బోతానే." మరో పిల్లవాడడిగాడు.

"తిండి లేకపోయినా ముక్కుకో బులాకీ అని ... నీకు బడొకటి కరువొచ్చిందిరా! నోరు మూసుకుని పడుండు." సంక బిడ్డకు పాలిస్తూనే కసురుకుంది ఆ యింటి ఇల్లాలు చుక్కమ్మ.

"ఏందయ్యో! నిన్నటి నుంచీ సెప్తా వుండా. నీ మొఖుసుకెక్కలా, యింట్లో నూకలైపోయి మూడు దినాలయింది. నిన్నా, ఈపూటా, అడుగూ బొడుగూ ఊడ్చి సేరెడు నూకలు దీసి, గంజిగాసి తలాంత బోసినా. మద్దేనేళ నించీ పొస్తులే. యిది సాలక దా ముసిలోడు యిబ్బుడో యెబ్బుడో అన్నిట్టుండాడు."

మంచం మీదున్న ముసలాయన్నుజూసి ఆయాసపడిపోతూ చెప్పింది చుక్కమ్మ.

ఖల్లుఖల్లున వినిపిస్తున్న తండ్రి దగ్గు వింటూ నిస్సహాయంగా శూన్యంలోకి చూస్తుండిపోయాడు మునిదాసప్ప. అతనికి ఒక్క చావు కర్మలు తప్ప మరే పనీ చేతకాదు. పైగా కూలి పనికి పోదామన్నా ఎక్కడా కూలీల్లేవు. కరువు నేల! కరువు కాలం! ఏంచేయాలో అర్థంగాక మనసులోనే రోధించసాగాడు మునిదాసప్ప.

ఇంతలో ఆ గతుకుల రోడ్డు గుండా సారా తాగిన వ్యక్తిలా ఊగుతూ ఓ కారొచ్చి ఆ గుడిసెముందరాగింది. ఆ శబ్దం విని పిల్లలంతా కేరింతలు కొడుతూ దాని చుట్టూ మూగారు. ఆగిన కారులోంచి యిద్దరు వ్యక్తులు దిగారు. అందులో ఒక వ్యక్తి అతన్ని సమీపించి "ఏమయ్యా! దాసప్ప యిల్లు యిదేనా?" అని అడిగాడు.

నాగరీకులు తనింటికెందుకొస్తారో అతనికి బాగా తెలుసు. ఏదో బేరం తగిలిందనుకుంటూ ఎంతో వినయంగా వంగి "నేనే సాఁవీ!" అన్నాడు.

"ఏం లేదయ్యా. మా యింట్లో ఒక పెద్దాయన కాలమైపోయినాడు. దహన కర్మ చేయాల."

"అట్లే సాఁవీ!"

"ఎంతడగతావ్?"

ఎంతడగాలన్న సందిగ్ధంలో పడ్డాడు మునిదాసప్ప.

"య్యోవ్. గుంత కూడా నువ్వే తొవ్వించాల. దానికింకొకర్ని యాడ అడిగేది అంతా కలిపి వొగేతూరే అడుగు." అంతవరకూ మౌనంగా చూస్తున్న రెండో వ్యక్తి కల్పించుకుంటూ అన్నాడు.

"ఆయనకు తమరేమవుతారు సాఁవీ!" అడిగాడు మునిదాసప్ప.

"అయిన వాళ్ళంలే."

"తఁవరు మోడికార్లా? నామదార్లా?"

ఆ మాటతో అదేమిటో తెలీదే అన్నట్లు మొదటి వ్యక్తి ముఖంలోకి చూసాడతను.

"నాందార్లే" చెప్పాడు మొదటి వ్యక్తి.

"నాందార్లయితే శ్యానా పనుంటుంది సాఁవీ! గొర్ని కోసి తునకలు వండాల. అందరికీ వడ్డించాల"

"అదంతా మా వోళ్ళు సూసుకుంటారు గానీ, నువ్వు సూసుకోని అడుగు." మళ్ళీ ఆలోచన్లలో పడ్డాడు మునిదాసప్ప.

"సమయం వచ్చింది కదాని ఎక్కువడిగితే వద్దులే అంటా యింకొగ దాసప్ప దెగ్గిరికి పోతారేమొ." అనుకుని ఆలోచనల్లో పడిపోయాడు.

"మామూలుగా శవాన్ని ఎత్తకపొయ్యి దహనం చేసే వోళ్ళు 'మోడి కార్లు.' అట్లా గాకుండా బ్రాహ్మలు, శెట్లుగాక, మిగిలిన కులాలోళ్ళు, యింట్లో పీనిగ బడగానే, దాసప్పను పిలిపించాల. శవంతో బాటు అందురూ నామాలేసుకోవాల. ఆపైన దాయాదులందురూ కలిసి యాటను గొట్టి తునకలొండి, శవం చేతిని కూరలో అద్దాల. ఆ పైన శవాన్ని నట్టింట్లో కూసోబెట్టి, అందురూ కూసోని, కూరతో అల్లిమేసుకోవాల. శవం నోట్లో వొగ తునకను బెట్టి, అల్లేలారగించాల. అది అయింతర్వాత దాసప్ప శంఖం ఊదతాడు అప్పుడు శవాన్ని దెచ్చి ఈదిలో బెట్టి నీళ్ళు బోసి ఎత్తకపొయ్యి పూడ్చాల. ఆ గుంత కాడా వొగకోడిని గావియ్యాల. దినాలప్పుడు మళ్ళా వొగయాటను గొట్టాల. కర్మాంతరం తీర్చుకోవాల ఇట్ల జేసేవోళ్ళు "నామదార్లు". వీళ్ళు వీర వైష్ణవులు. వొగే కులమైనా నామదార్లు, మోడికార్లమద్దెన కంచం పొత్తేగానీ పెండ్లి పొత్తులే. ఈళ్ళకు ఈ కర్మాంతరం తీర్చేదానికే మా దాసప్పలు ఏర్పాటైనారు."

"యోవ్ దాసప్పా సెప్పయ్యా అంటే ఆలోచన్లోపడిపోతివే" అన్నాడు ఆ యిద్దర్లో ఒకతను. ఆ మాటతో ఇహంలోకొచ్చిన దాసప్ప ఏన్నూరుయియ్యండి సాఁవీ" అన్నాడు.

'ఇదేందయ్యో. అట్లడిగితివి?" మొదటి వ్యక్తి బేరమాడే దృష్టితో అన్నాడు.

"అంత కష్టముండాదిలే సాఁవీ."

"సరే. యింకోమాటజెప్పు!" అన్నాడు రెండో వ్యక్తి.

"ఈ తడవ మీరే ఏదో సెప్పండి సాఁవీ."

"యిది సావు. బాధల్లో వుండాము. రెండొందలిస్తాములేవయ్యా."

"గిట్టదు సాఁవీ. గుంత తొగించాల. కర్మాంతరం చేయించాల. యివన్నీ జేయాలంటే గొంతులో కాసింత మందు బడాల. ఏదో సాఁవీ. మీరియ్యాల. మేంతినాల." మందు గుర్తుకు వచ్చి నోరు చప్పరిస్తూ చెప్పాడు దాసప్ప.

"మరెంతియ్యమంటావ్?"

"అయిదొందలియ్యండి సాఁవీ."

"అదీ యిదీ వద్దుగానీ మున్నూరు మట్టసంగా సేసుకోపో, యింకేం మాట్లాడొద్దు." తెగేసి చెప్పాడు రెండో వ్యక్తి.

"సరే. తఁవరు అట్లనేసినాంక యింక మాట్లాడేదేముండాది!"

అసంతృప్తిగానే వప్పుకున్నాడు మునిదాసప్ప. దాంతో మొదటి వ్యక్తి జేబులో నుంచీ కొంత డబ్బులు తీసి అడ్వాన్సు యిచ్చి. "మిగిలింది కడానిస్తాము" అన్నాడు.

"సాఁవీ ... సారాయి కేదన్నా అంతకొట్టండి." నసుగుతూ రెండు చేతులూ ముందుకు సాచి అడిగాడు మునిదాసప్ప. తన జేబులో నుంచీ అయిదు రూపాయలు తీసి అతని చేతుల్లో పెట్టి 'తాగబో' అన్నాడతను.

"తాగేసి యాడన్నా ఎగ్గొట్టేసేవు?" హెచ్చరించాడింకొకతను.

"ఏంది సాఁవీ అట్టంటారు. నేను శ్యాన నికార్సయిన మడిసిని సాఁవీ!" డబ్బులు బొడ్లో దోపుకుంటూ అన్నాడు దాసప్ప. అలావాళ్ళ మధ్యన బేరం కుదిరాక ఏమేమి కావాలో అడిగాడు మొదటి వ్యక్తి.

"ఏమయ్యా, దాసప్పా! ఏమేమి తెచ్చుకోవాలో సెప్పయ్య!"

"ఆరు మీటర్లు తెల్లగుడ్డా ... "

" ఏమయ్యోయ్! అంతెందుకు?" మధ్యలోనే ప్రశ్నించాడు రెండో వ్యక్తి.

" సరే, ఎంతో వొగంత తఁవరే తెచ్చుకోండి. " ఒక బిడ్డకు చొక్కా గుడ్డ తగ్గిపోయనే అనుకున్నాడు మనసులోనే మునిదాసప్ప.

తిరిగి చెప్పసాగాడు - "మూడు టెంకాయలు, కడ్డీలు, కర్పూరము, శవం పైన సల్లేదానికి అయిదు శేర్లు బొరుగులు, అందులోకి ఒక శేరు సిల్లర కాసులు, తాంబూలం, గుంతకాడ గావుకు ఒక కోడి పుంజు - ఇవి కావాల. గొర్రె అదీ మీరే సూసుకోండి."

"సరే, గుంత తవ్వే వోల్లను మాతో పంపించు" అని మొదటి వ్యక్తి అనగానే పక్క గుడిసెలోకి వెళ్లి ఇద్దరు మనుషులను తీసుకువచ్చి వారి వెంట పంపించాడు మునిదాసప్ప.

"మూడు గంటల కంతా వచ్చేయ్!" అని చెప్పి, చిరునామా ఇచ్చి వారిని పిలుచుకుని వెళ్లిపోయారు వాళ్లు.

◆ ◆ ◆ ◆

తన తర్వాత కులవృత్తి అయిన దాసప్ప ఆచారాన్ని నిలబెట్టేందుకు ఇప్పటి నుంచే శిక్షణ ఇస్తున్న పదహారేళ్ల తన కొడుకైన శివదాసప్పను పిలిచి, ఒక చురకత్తిని, ఒక పాత్రను ఒక చేతి సంచిలో ఉంచి దాన్ని అతని చేతికిచ్చి తన వెంట తీసుకుని, అనుకున్న సమయానికి అక్కడికి చేరుకున్నాడు మునిదాసప్ప. అప్పటికే గుంత తవ్వడానికి వెళ్లిన వాళ్ళ సహాయంతో మాంసం వండారు. ఆ వండిన మాంసంలో శవం కుడిచేతిని అద్ది, శవం నోట్లో ఒక మాంసపు ముక్క పెట్టి ఆ వండిన మాంసాన్ని వచ్చిన బంధువర్గానికందరికీ వడ్డించారు.

చివర కొడుకుతోబాటు తానూ ఆ చావు కూడు కడుపార తిన్నాడు దాసప్ప. మిగిలిన అన్నాన్ని మూటగట్టి ఓ మూల పెట్టి, మిగిలిన కూరను వెంట తెచ్చుకున్న పాత్రలో పోయించుకుని దాన్ని కొడుకు చేతికి ఇచ్చాడు. నామదార్లు కాని ఇతరులు ఆ శవాన్ని చూడటానికి వస్తే శవం చుట్టూ తెరకట్టి ముఖం మాత్రమే చూపించాలి. ఆ తంతు కూడా మునిదాసప్పే నిర్వహించాడు. ఆ తర్వాత అక్కడ ఇంటి ముందర వీధిలో శవాన్ని పెట్టించి, స్నానం చేయించసాగాడు. డప్పులు చావు దరువులా, ప్రాణం పోయే ముందు కొట్టుకునే హృదయంలా మెల్లగా, లయ బద్ధంగా మోగుతున్నాయి. అక్కడ అందరి హృదయాల్లోనూ స్మశాన వైరాగ్యం చోటు చేసుకుంది. అక్కడ చేరిన ఆడంగులు - "ఏం బిడ్డెలో, ఏం పాపలో!" అనుకుంటూ ముక్కులు చీదుకుంటున్నారు.

తయారైన పాడె పైన శవాన్ని పెట్టించి చేతులకు, కాళ్లకు 'బందిలి' వేశాడు ముని దాసప్ప. గుంత తవ్విన వెంకటయ్య, నాగయ్యల సాయంతో శవానికి తెల్లగుడ్డ చుట్టించి వరిగడ్డితో పేనిన తాటితో శవాన్ని పాడెతో బిగగట్టించాడు. అలా అన్నీ సిద్ధమైన తర్వాత కొబ్బరికాయ కొట్టి, వప్పుల్ని కొడుకును పిలిచి అతని చేతికిచ్చాడు. అతను వాటిని చేతి సంచిలో వేసుకున్నాడు. మునిదాసప్ప ఒక చేత్తో గంట వాయిస్తూ, మరో చేత్తో శంఖం ఊదాడు. అంతే! అక్కడ 'గోవిందా! గోవిందా!' అన్న మాటలు మిన్నుముట్టాయి, ఆ మరుక్షణం నేలపై వున్న పాడె మనుషుల భుజాల పైకొచ్చింది.

డప్పుల మధ్య గంట కొడుతూ శంఖం ఊదుతూ దాసప్ప ముందు వెళ్తుంటే డప్పుల వాళ్ళ వెంట శవం ఊరేగింపు స్మశానం వైపు సాగింది. దారిపొడుగునా శవం పైన చల్లుతున్న పూలు, బొరుగులు, కాసులు కింద పడుతున్నాయి. కిందపడిన కాసుల్ని శివదాసప్ప ఏరుకుంటూ వస్తున్నాడు. స్మశానానికల్లంత దూరంలో 'దింపుడు కళ్లెం' సాగింది. అక్కడ కర్పూరం వెలిగించి మరో కొబ్బరికాయ కొట్టాడు మునిదాసప్ప. వాటినీ ఏరి శివదాసప్ప సంచిలో వేసుకున్నాడు. దింపుడు కళ్లెం నుంచి గుంత దగ్గరకు చేర్చారు శవాన్ని. అక్కడ వెంకటయ్య, నాగయ్యల సాయంతో శవాన్ని గుంతలో పెట్టించాడు మునిదాసప్ప. చేతి సంచిలో వున్న చురకత్తి తీసిచ్చి బందిలికోయించాడు.

"వొరే, యంగటా! గుడ్డ సించరా!" పురమాయించాడు శవం పక్కన నిలబడి ఉన్న వెంకటయ్యకు.

వెంకటయ్య శవానికి చుట్టిన గుడ్డలో కొంత భాగాన్ని పైకి లాగి చించబోయాడు.

"వొరే, ఉండ్రా నా కొండె. ఇంకొంచెం ఎక్కువగా వచ్చేటట్లు కొంచెం దిగువకు సించరా!" అని మునిదాసప్ప సూచనతో సర్రున చించాడు వెంకటయ్య.

"ఏం జించినావురా! మొగబిడ్డెకు బాడీ కూడా గాదే!" చించిన తెల్లగుడ్డను అందుకుని పరిశీలిస్తూ తనలో తానే గొణుక్కున్నాడు మునిదాసప్ప.

అందులో నుంచి ఒక జానెడు పీలికను తిరిగి వేరు చేసి, దాన్ని తల కొరివి పెట్టేవాడి మొలకు చుట్టాడు.

"నాయినా, ఇది భద్రంగా ఉండాల సాఁవీ! ఇంట్లో దీపం కింద పెట్టాల" అని వెంట వెంటనే పనులన్నీ చకచకా చేసుకుపోతున్నాడు.

"వాత బియ్యం!" అని కేకేశాడు. వెంటనే పక్కనే ఉన్న శవం తాలూకు మనిషి ఇంటి నుంచి తెచ్చిన బియ్యాన్ని ఒక పాత చేటతో అందించాడు.

"వాత బియ్యం ఎయ్యి సాఁవీ!" అని తల కొరివి పెట్టే వాడి చేతికి కొన్ని బియ్యాన్ని పిడికిలితో ఇచ్చి శవంపైన వేయించాడు.

"వొగొగరే వచ్చి వాతబియ్యమేయండి, సాఁములూ! కడయాత్ర పుణ్ణెమొస్తుంది" బిగ్గరగా అరిచాడు.

ఆ మాటతో ఒక్కొక్కరే వచ్చి అతని చేతిలోని వాతబియ్యాన్ని తీసుకుని అక్షంతల్లా శవంపైన చల్లి పక్కకు తప్పుకున్నారు.

"వొరే అబ్బోడా! యాడుండావురా!" అని కొడుకును కేకేయగానే, అంతవరకూ ఆ తంతంతా చూస్తున్న శివదాసప్ప ముందుకొచ్చి "ఏమప్పా!" అన్నాడు. "సంచి పట్రా!" అని అతని చేతిలోని సంచిలో మిగిలిన బియాన్ని పోసుకున్నాడు.

వండిన పిండానాన్ని తల కొరివి పెట్టేవాడి చేతి కిచ్చి "మెతుకు లెయ్యి, సాఁవీ!" అని అతని చేత ఆ శవం పైన మెతుకులు వేయించి ఆ చట్టిని అక్కడే తలవైపుకు గుంతలో వేయించాడు. అలాగే మొలలో గుడ్డ చుట్టిన వ్యక్తిచేత మట్టి వేయించి తలకొరివి పెట్టించి, బంధువులచేత కూడా మట్టి వేయించాడు.

"ఎవ్వరైనా మట్టెయ్యొచ్చు, సాఁవీ! మనం సచ్చినప్పుడు మట్టి ఏసేవోళ్లు వుంటారో, వుండరో. యెయ్యండి!" అని కేకేశాడు దాసప్ప.

అలా ఆ శవాన్ని పూడ్చడం పూర్తయ్యాక వెంట తెచ్చిన కోడి పుంజుకు కాళ్లు కట్టివేసి, ఆ గుంతపైన అటువైపు నుంచి ఇటువైపుకు మూడుసార్లు విసరేసి, ఆ కోడిని కొడుకు చేతికిచ్చాడు. శివదాసప్ప దాన్ని చేతపట్టుకున్నాడు. ఒక మనిషికి ఆఖరి వీడ్కోలిచ్చిన అక్కడి వారంతా స్మశాన వైరాగ్యం వదులుకుని తిరుగు ముఖం పట్టారు.

"వొరే, అబ్బా! నువ్వు ఇంటికి పో! నేను మల్లొస్తా!" అని చెప్పి శివదాసప్పను ఇంటికి పంపేశాడు మునిదాసప్ప. తన తండ్రి తర్వాత ఎందు కొస్తా నన్నాడో శివదాసప్పకు తెలిసినా,

ఏమీ అనలేకపోయాడు  అది అతనికి మామూలే  రావాల్సిన డబ్బులు తీసుకుని, గుంత తవ్విన వెంకటయ్యకు  నాగయ్యకు వాళ్ళ వాటాలు వాళ్ళకిచ్చి పంపించేశాడు

"ఇంక వారందాకా బయ<వులా  యట్టో వొగట్టా కడుపాత్రం తీరుతుంది  అంతలోపల ఇంత పెద్ద పట్నంలో ఏ మారాజో ఓ మారాజు సావకపోతాడా, మన పొట్ట గడవకపోతుందా' అనుకుంటూ అక్కడి నుంచి బయలుదేరాడు మునిదాసప్ప

"నీ ఇంటి మొదలు పడిపోనానీ! నీ యప్ప సచ్చిపొయ్యి అందురూ యాడత్తా వుంటే నువ్వు సారాయి దాగొచ్చినావా?" గుంపుగా చేరి ఉన్న మనుషుల్లో నుంచి వచ్చిన పక్కింటి చెంగమ్మ తాగొచ్చిన మునిదాసప్పను తిట్టుకుంటూ వెళ్లిపోయింది

"వొసే నీ యబ్బడాలా!" అని నత్తి నత్తిగా గొణుక్కున్నాడు మునిదాసప్ప

"వొరే, దాసప్పా! మళ్లా తాగేసొచ్చినావా? సిగ్గులేదంట్రా నీకు! ఆడయాడనో ఎవురికో కర్మాంతరం చేయను బొయ్యినావు  బిడ్డలు పస్తులుంటే ఆ దుడ్డుతో తాగేసొచ్చినావు  ఇక మీ యప్పకు కర్మాంతరం చెయ్  తుఫ్!" మరో అతను ముఖాన ఉమ్మినట్లు అనడంతో మత్తంతా దిగిపోయిన ట్లనిపించిం దతనికి

గుడిసె ముందర పాత నులక మంచం మీద, శవంగా మారివున్న తండ్రిని చూసి అంత మత్తులోనూ అతనికి కళ్ల నీళ్లు గి<రున తిరిగాయి

ఎందుకంటే అతనూ నామధారే, కాబట్టి 'కర్మాంతరానికి ఎంతవుతుందో ఎన్ని ఇబ్బందులు పడాలో! ఎవుర్నడగలో!' అనుకుంటూ తన తప్పుకు తానే పశ్చాత్తాప పడిపోతూ అక్కడే కూలబడిపోయాడు మునిదాసప్ప

● 26-5-1993 - ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక ●